ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.6 ; కనిష్ఠం 23.5

కామారెడ్డి
జిల్లా వార్తలు
5
సోమవారం 5 ఆగస్టు 2024

పెద్దకొడప్‌గల్‌లో ఈజీఎస్ సామాజిక తనిఖీ

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 4: మండలంలో ఉపాధి హామీ 3వ విడత సామాజిక తనిఖీ ప్రారంభం అయ్యిందని ఈజీఎస్ ఏపీవో సుదర్శన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని 23 గ్రామాలకు సంబంధించి 312 పనులు చేశామని తెలిపారు. ఇందులో ఉపాధి హామీకి సంబంధించి రూ.1 కోటి 78లక్షల 46వేల 456 పనులు, పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి రూ.1కోటి 50లక్షల 94వేల 113 పనులు చేశామన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు పర్యటించి ఆడిట్ చేస్తారని తెలిపారు.



మొక్కకు దిక్కేది?



- జిల్లాలో అభాసుపాలవుతున్న మొక్కల పెంపకం
- ప్రతీ శుక్రవారం నీళ్లు పోయాలనే నిబంధన గాలికి
- కాగితాల్లోనే మొక్కలు నాటిన వివరాలు
- నిర్వహణ కరువై ఎండిపోయిన మొక్కలు
- నేటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం
- క్షేత్రస్థాయిలో పర్యటించనున్న జిల్లా ఉన్నతాధికారులు



కామారెడ్డిలో రహదారి వెంట నాటిన మొక్కలు నేలకొరిగిన దృశ్యం

కామారెడ్డి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఏటా సగటున 35 లక్షల మొక్కలు నాటుతోంది. ఇందుకు బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేపడుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆశించిన స్థాయిలో మొక్కల పెంపకం లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 9 ఏళ్లుగా నాటిన మొక్కలకు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న మొక్కల లెక్కలకు పొంతన లేకుండా ఉంది. గత ప్రభుత్వంలో హరితహారంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటడం, ఫొటోలకు ఫోజులు ఇవ్వడం, ఫేస్ బుక్, వాట్సాప్ ఇతర సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం తప్ప నాటిన మొక్కలు ఎలా ఉన్నాయి. వాటికి నీరు పోస్తున్నారా రక్షణ కల్పించారా వంటి అంశాలను పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. లక్షల రూపాయలు వెచ్చించి నాటిన మొక్కలు పట్టించుకునే వారు లేక ఎండిపోతుండడంతో ఖర్చు చేసిన నిధులు వృథా కావడంతో పాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. వన మహోత్సవం పేరుతో ఇటీవల నాటుతున్న మొక్కలు సైతం అంతంత మాత్రంగానే నాటుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పంచాయతీ, మున్సిపాలిటీల్లో మొక్కల నిర్వహణ గాలికి

జిల్లాలో మొత్తం 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో గత ఏడాది హరిత హారం పథకం కింద 30.03 లక్షల మొక్కలను నాటారు. ఉపాధి హామీ లక్ష్యం 23.3లక్షలు, అటవీ శాఖ 3.9లక్షలు, ఇతర ప్రభుత్వ 1.27లక్షలు నాటారు. గ్రామ పంచాయతీల్లో నాటిన మొక్కలను సంరక్షణ చేసేందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మొక్కల పెంపకం పథకం నీరుగారిపోయింది. అదేవిధంగా జిల్లాలో కామారెడ్డి మున్సిపాలిటీతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ మూడు మున్సిపాలిటీల పరిధిలో 1.4లక్షల మొక్కలను నాటారు. ప్రధాన రహదారుల వెంట నాటిన మొక్కలపై మాత్రమే దృష్టి సారిస్తున్న మున్సిపల్ అధికారులు పలుచోట్ల ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్, నాటిన మొక్కలపై మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రధాన రహదారుల వెంట ప్రయాణిస్తున్నప్పుడో లేదంటే ఎవరైన హరిత ప్రేమికులు ఎండిన మొక్కలు, పాడైన ట్రీగార్డులను చూపి సోషల్ మీడియాలో వైరల్ చేయడమో చేస్తారని మాత్రమే మొక్కలకు నీరు అందేలా చూస్తున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. ఆయా వార్డులలో నాటిన మొక్కల సంరక్షణ ప్రజాప్రతినిధులు సైతం దృష్టి సారించాల్సి ఉన్నా అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు కేవలం మొక్కలు నాటేటప్పుడు మాత్రమే పబ్లిసిటి కోసం కనిపిస్తున్నారే తప్ప వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టడం లేదు. వీరిలా ఉంటే అధికారులు మరింత నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణాల్లో అంతర్గత రోడ్లలో నాటిన మొక్కలు సైతం చాలా వరకు కనుమరుగయ్యాయి. కేవలం కాగితాల్లోనే మొక్కల పెంపకం, సంరక్షణ ఉంటుందే కానీ క్షేత్రస్థాయిలో మాత్రం మొక్కలపై ఎవరు శ్రద్ధ వహించడం లేదు.

నాటినవి నాటినట్లే విరిగిపోయి, వాడిపోయిన వైనం

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్ కింద గత ఏడాది 300ల కిలో మీటర్ల పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులకు ఇరువైపులా 1.41లక్షల మొక్కలను నాటారు. వీటి పెంపకం అటవీ, పంచాయతీ, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా చేపట్టాల్సి ఉంటుంది. ఈ రహదారుల వెంట నాటిన మొక్క ల పెంపకం, సంరక్షణ కోసం అవసరమైన కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాల రాకపోకలతో పెరిగిపోయాయి. నాటిన తర్వాత వాటికి నీళ్లు కూడా పోయకపోవడంతో చాలా వరకు ఎండిపోయాయి. ఈ ప్రధాన రహదారుల వెంట ప్రస్తుతం నాటిన మొక్కలు చాలా వరకు కనిపించడం లేదు. ప్రస్తుతం పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాల్లో మినహా ఇతర ప్రాంతాల్లో నాటిన మొక్కలు కూడా నీరులేక వాడిపోయి కనిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో నాటిన మొక్కలు సైతం చాలా వరకు ఎండిపోయాయి.

కరువైన రక్షణ

ప్రభుత్వం చేపట్టిన సమయంలోనే అధికారులు హడావిడి చేస్తున్నారు. ప్రజలకు పచ్చని వాతావరణంతో పాటు ఆహ్లాదాన్ని అందించాలనే ప్రభుత్వ లక్ష్యం ను కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీరుగారుతోంది. మొక్కలకు నీరు అందించేలా ప్రతీ శుక్రవారం వాటరింగ్‌డే నిర్వహించాల్సిన అధికారులు ఆ సంగతే మరిచిపోయారు. కార్యక్రమం ప్రారంభం అయిన ప్రతీసారి మొక్కలను ఎవరైన తొలగించిన, పశువులు, మేక లు వాటిని పాడు చేసినా సంబంధిత వ్యక్తులకు జరిమానాలు విధించిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఆ తర్వాత నిత్యం వాటిని సంరక్షణ చేపట్టేందుకు చర్యలు మాత్రం కరువవుతున్నాయి. నాటిన మొక్కల సంరక్షణకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం లేదు. రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలపై వాహనాలు వెళ్లడం, పశువులు తొక్కడంతో వీటిలో చాలా వరకు విరిగిపోయాయి. ఉన్న వాటికి కూడా నీరు పోయడం లేదు. దీంతో ఎండకు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం చేపడుతున్న మొక్కల పెంపకంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని నేటి నుంచి నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మొక్కల పెంపకం కూడా ఒక భాగంగా ఉన్నందున స్థానిక అధికారులకు ఉన్నతాధికారులు తగిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు

ఊరూరా పచ్చని పైర్లు

- సిరులు పండుతాయని రైతుల ఆశలు
- నిండని నిజాంసాగర్ ప్రాజెక్టు, చెరువులు, కుంటలు
- ఆందోళనలో రైతాంగం, వర్షాకాలంలో సిరులు పండేనా?
- ప్రశ్నార్థకంగా వానాకాలం వరి సాగు

నిజాంసాగర్, ఆగస్టు 4: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అనుకూలంగా లేవు. ముందస్తుగా రైతాంగం ఊరూరా బోరు బావులు, ప్రాజెక్టు, చెరువు కుంటల కింద వరి నాట్లు వేశారు. ఊరూరా ఆయకట్టు కింద పచ్చని పైర్లతో భూమికి పచ్చని రంగేసినట్లు ఎంతో ఆహ్లాదకరంగా కనువిందు చేస్తున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు నాన్ కమాండ్ ఏరియాలోని రైతాంగం వరుణుడు కరుణిస్తే భారీ వర్షాలు పడి నిజాంసాగర్ ప్రాజెక్టు కిందట, నిజాంసాగర్ ప్రాజెక్టు చెరువు, కుంటల కింద వరి పంటలు గట్టెక్కుతాయని ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ముందస్తుగా ఆయకట్టు కింద లక్షా 15వేల ఎకరాలతో పాటు బోరు బావుల కింద మరో 65 వేల ఎకరాలు సాగు చేశారు. నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాలో దాదాపు 13 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. నాన్ కమాండ్ ఏరియాలో మంజీరా నదిని నమ్ముకున్న రైతాంగానికి నిరాశగానే మిగులుతోంది. వర్షాకాలంలో మంజీరా నది నిండు జలాలతో కళకళలాడుతుండేది. కాగా ఈ ఏడాది మంజీరా నది నీరు లేక బోసి పోయింది. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం అడుగంటిపోయింది. ఈ ఏడాది సాగర్ ఆయకట్టు కింద చెరువుల కింద పూర్తిస్థాయి విస్తీర్ణంలో వరి సాగు చేశారు. చెరువు, కుంటల కింద వేసిన పైర్లకు ఇక నీరేట్లు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊరూరా పచ్చని వరి పైర్లు కనబడుతునే ఉన్నాయి. ఈ ఏడాది వరి పైర్లు ఎంతో ఏపుగా పెరుగుతునే ఉన్నాయి. రైతులు ఈ ఏడాది అధిక దిగుబడి సాధించవచ్చనే ధీమాలో ఉన్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా భారీ వర్షాలు కురియకపోవడంతో ప్రాజెక్టులు, చెరువులు బోసిపోయాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు కురిసి నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు చిన్న నీటి వనరులు నిండుతాయనే ధీమాలో రైతాంగం ఉన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం రైతు భరోసా అమలు చేయకున్నా రైతాంగం అప్పో సొప్పో చేసి వరి సాగు చేసుకుంటున్నారు. నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చిన్న నీటి వనరుల్లో నీరు వచ్చి చేరితేనే సిరులు పండనున్నాయి. వర్షాలు కురియకుంటే భవిష్యత్తు ప్రశ్నార్థకమే.



వడ్డేపల్లి శివారులో కనువిందు చేస్తున్న వరి పైర్లు

నేటి నుంచి ఆలయాల్లో శ్రావణమాస పూజలు



భిక్కనూరులో సిద్ధరామేశ్వర ఆలయం (ఇన్‌సెట్‌లో) స్వామి వారి మూలవిరాట్

భిక్కనూరు, ఆగస్టు 4: జిల్లాలోని ఆలయాల్లో సోమవారం నుంచి శ్రావణ మాస పూజలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా దక్షిణకాశీగా బాసిల్లుతున్న మండలంలోని శ్రీ పార్వతీ సిద్ధరామేశ్వర ఆలయం నిత్యం భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ ఆలయాన్ని సిద్ధగిరి, రామగిరి అనే యోగి పుంగవులు 400సంవత్సరాల క్రితమే నిర్మించారని, దోమకొండ సంస్థనాధీశులు సిద్ధరామేశ్వర ఆలయాన్ని ఇలవేల్పుగా చేసుకొని ప్రార్థించినట్లు చరిత్ర చెబుతోంది. సిద్ధగిరి, రామగిరి ఇరువురు ఈ ఆలయాన్ని నిర్మించడంతో దీనికి శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంగా పేరు వచ్చినట్లు పూర్వీకులు చెబుతారు. ఆలయంలో శ్రావణమాసంలో స్వామి వారికి నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. శ్రావణమాసం సందర్భంగా స్వామి వారిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. కాగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు.

ఆలయానికి చేరుకొండిలా..

ఆలయానికి 44వ జాతీయ రహదారి, రైలు మార్గం ద్వారా చేరుకోవచ్చు. మండల కేంద్రానికి 2కిలో మీటర్ల దూరం ఉన్న ఈ ఆలయం కామారెడ్డి నుంచి 25 కిలో మీటర్లు, భిక్కనూరు నుంచి కేవలం ఒక్క కిలోమీటరు దూరం ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు భిక్కనూరుకు చేరుకుంటే అక్కడి నుంచి ఇతర వాహనాలు అందుబాటులో ఉంటాయి.



తల్లి పాలే.. శ్రేయస్కరం!

- శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం
- వారం రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు
- జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాల నిర్వహణ

కామారెడ్డి టౌన్, ఆగస్టు 4: తల్లిపాల ప్రాముఖ్యాన్ని మహిళలకు వివరించేందుకు ప్రభుత్వం ప్రతీ ఏడాది ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోంది. సమగ్ర శిశు అభివృద్ధి సేవా సంస్థ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దీనిపై వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు వివరిస్తారు. పలు ప్రాంతాల్లో నేటికి కాన్పు కాగానే పుట్టిన బిడ్డకు తల్లిపాల(ముర్రుపాలు)ను ఇవ్వరు. దీనిపై ప్రజల్లో అనేక అపోహలున్నాయి. ఆ తర్వాత కూడా తల్లిపాలను ఇవ్వడం తగ్గించి మార్కెట్‌లో లభించే డబ్బా పాలను పడుతుంటారు. దీని ఫలితంగా పుట్టిన బిడ్డ పెరిగి పెద్దయిన తర్వాత అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పిల్లల్లో రోగ నిరోధకశక్తి తగ్గి అనేక రకాల వ్యాధులు చిన్నపిల్లలను పట్టి పీడిస్తాయి. తల్లిపాలపై ప్రజల్లో ఉన్న అపోహలను పోగొట్టి పుట్టిన వెంటనే బిడ్డకు తల్లి పాలు ఇచ్చేలా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రతీ ఏటా తల్లిపాల వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది.

తల్లిపాలే బిడ్డకు అమృతం

ప్రస్తుతం పుట్టిన గంటలో 41 శాతం మంది పిల్లలకు మాత్రమే తల్లిపాలు ఇస్తున్నారు. దీనివల్ల పిల్లలకు భవిష్యత్తులో అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయని ఐసీడీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయి. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత గంటలోపే బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలి. తల్లిపాలలో కొలస్ట్రం అనే పదార్థం ఉంటుంది. ఇది మంచి ఇమ్యూనోగ్లోబిన్‌గా పని చేస్తోంది. దీనివల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సాధారణంగా పిల్లలకు ఐదేళ్లలోపు వచ్చే డయేరియా, వైరల్ జ్వరాలు, కామెర్లు వంటి రకరకాల వ్యాధుల నుంచి తల్లిపాలు రక్షిస్తాయి. అదేవిధంగా పిల్లలకు శ్వాసకోశ వ్యాధులు, అస్తమా, అలర్జీ, డయాబెటిస్ క్యాన్సర్, ఊబకాయం, చెవిలో ఇన్‌పెక్షన్‌లు వంటివి రాకుండా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లల మానసిక పెరుగుదలకు తల్లిపాలు ఎంతో దోహదం చేయడమే కాకుండా బరువును అదుపులో ఉంచుతోంది. క్రమం తప్పకుండా పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలను తప్పక ఇవ్వాలని వైద్యులు స్పష్టం చేస్తుంటారు.

తల్లికి మేలే..

తల్లిపాలను బిడ్డకు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యానికే కాకుండా తల్లి ఆరోగ్యానికి కూడా మంచి చేస్తోంది. తల్లి పాలను బిడ్డకు ఇవ్వడం వల్ల తల్లీ బిడ్డల మధ్య అనుబంధం పెరుగుతోంది. ప్రసవం తర్వాత మహిళలు సాధారణంగా నెలరోజుల వరకు రక్తస్రావంతో బాధపడుతుంటారు. కానీ తల్లిపాలను బిడ్డకు ఇవ్వడం వల్ల దీనిని నివారించవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అదే విధంగా కొందరు కాన్పు అయిన తర్వాత వెంటనే మళ్లీ గర్భం రాకుండా గర్భ నిరోధక మాత్రలు వేసుకుంటుంటారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ఇది గర్భ నిరోధక సాధనంగా కూడా పని చేస్తుందని చెబుతున్నారు. అయితే జిల్లాలోని 24 మండలాల పరిధిలో 1193 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 6 నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 53,413 మంది వరకు ఉన్నారు. గర్భిణులు 6,664, బాలింతలు 5,851 మంది ఉన్నారు. వీరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల పరిధిలో వారం రోజుల పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లులు, గర్భిణులు, మహిళలను పిలిపించి వారికి తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రం

● ఆర్మూర్ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న సోయా పంట



తగ్గిన సోయాబీన్ సాగు విస్తీర్ణం

● మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపిన రైతులు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 4: ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో సోయాబీన్ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గత సంవత్సరంతో పోల్చితే సాగు విస్తీర్ణం 50శాతానికి పరిమితమైంది. సోయాబీన్ పంటకు గత సంవత్సరం వైరస్ సోకడం, పల్లకు తెగులు, కాండం తొలుచుపురుగు తెగులు (ఎల్లోముజాయిక్)సోకి చీడ పీడల బెడద ఎక్కువై దిగుబడి తగ్గింది. దీంతో రైతులు పంట దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయారు. దీనికి తోడు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంట దిగుబడి కూడా తగ్గడం ఒక కారణంగా భావించవచ్చు.. సోయాబీన్ పంటను గత సంవత్సరం జిల్లాలో సుమారు 55వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ సంవత్సరం 30వేల ఎకరాల్లో మాత్రమే సాగవుతుందని తెలుస్తోంది. ఆర్మూర్ మండల పరిధిలో గత సంవత్సరం సుమారు 4500ఎకరాల్లో సోయా పంట సాగు చేయగా ప్రస్తుతం కేవలం 1800ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. గత సంవత్సరం సోయాబీన్ పంట మిగిల్చిన నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈయేడు రైతులు సోయాబీన్ పంట సాగుకు బదులు మొక్కజొన్న పంట సాగుపై దృష్టి సారించారు. మొక్కజొన్న పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉండి గిట్టుబాటు అవుతుందన్న ఆలోచనతో రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు.

సోయా పంటకు బదులు మొక్కజొన్న పంటను రైతులు సాగు చేయడంతో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఈ సంవత్సరం జిల్లాలో సుమారు 45వేల ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో కూడా అక్కడక్కడ కత్తెర పురుగు, ఎండు తెగులు సోకినప్పటికీ సకాలంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో తెగుళ్ల తీవ్రత అంతగా లేదు. మొక్కజొన్న పంటను ఆర్మూర్ మండలంలో గతంలో మూడు వేల ఎకరాల్లో సాగు చేయగా ఈ సంవత్సరం ఐదు వేల ఎకరాలకు పెరిగింది. మొక్కజొన్న పంటకు మంచి ధర లభిస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. గత ఏడాది కూడా మొక్కజొన్న పంటకు మంచి ధర పలికింది. ఈ సంవత్సరం క్వింటాలుకు రూ.2500పైనే ఉంటుందని రైతులు భావిస్తున్నారు. దీనికి తోడు కొందరు రైతులు మొక్కజొన్న పచ్చిబుట్టను సాగు చేయడంతో తక్కువ సమయంలోనే అధిక ఆదాయం పొందుతున్నారు. పచ్చిబుట్ట ఎకరానికి గరిష్ఠంగా రూ.లక్ష 10వేల పలకడం మొక్కజొన్నకు ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తుంది. ఈ సారి సకాలంలో వర్షాలు కురువడంతో పచ్చిబుట్టకు మంచి ధర లభిస్తోంది. దీంతో పాటు ఎండు మొక్కజొన్నలను ఇథానల్ తయారీలో వాడుతుండడంతో మొక్కజొన్నకు డిమాండ్ పెరిగి అధిక ధర వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

• బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

వర్ని,ఆగస్టు4: రాష్ట్రంలో మోసపూరిత వాగ్ధానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మి నారాయణ ఆరోపించారు. ఆదివారం చందూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ మాసంలో కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. రైతు కూలీలకు రైతు భరోసా రూ.12వేలు ఇస్తానన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ పేరిట రెండు విడతల్లో జమ చేసిన డబ్బులు కేవలం 25శాతం మంది రైతులకు లబ్ధి చేకూర్చి మిగతా రైతులకు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఫలితంగా అన్నదాతలు రుణమాఫీకి నోచుకోలేక ఎవరిని అడగాలో తెలియక బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారుతోనే రైతులకు సమన్యాయం చేకూరుతుందని స్పష్టం చేశారు. రైతులతో పెట్టుకున్న వాళ్లకు రైతన్నలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కామారెడ్డి కన్వీనర్ శ్రీనివాస్, గణేష్ సింగ్, అరికెల సాయిరెడ్డి, నరెడ్ల నర్సింలు, సుమంత్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ వర్ధంతికి పూర్తి మద్దతు: మోహన్‌నాయక్

జక్రాన్‌పల్లి, ఆగస్టు4: హైదరాబాద్‌లో ఈనెల 6న జరిగే ప్రజా ఉద్యమకారుడు, గాయకుడు గద్దర్ వర్ధంతిని లంబాడ హక్కుల పోరాట సమితి పూర్తి మద్దతు ఇస్తోందని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 6న జరిగే గద్దర్ వర్ధంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు పా ల్గొన్నారు.

తొర్లికొండలో కొండపై పునుగు పిల్లి

జక్రాన్‌పల్లి, ఆగస్టు4: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం కొండపై పునుగు పిల్లి మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. వెంకటేశ్వరస్వామి కొండపై పునుగు పిల్లిలు ఉన్నాయని, పునుగు పిల్లి కళేబరం ఆదివారం కొండపై కనిపించినట్టు గ్రామస్థులు తెలిపారు. అనంతరం పునుగుపిల్లి కళేభరం కననం చేసినట్టు గ్రామస్థులు తెలిపారు.

తాగునీటి కోసం తంటాలు

• సారు మాకు దారేది, నీరేది
• భయం గుప్పిట్లో బతుకుతున్న కాలనీవాసులు
• నీటి కోసం వెళ్లాలంటే భయంగా ఉంది



నీటి కోసం బురదలో వెళ్లి తీసుకు రావలసిన దుస్థితి



రోడ్డును ధ్వంసం అయిన దృశ్యం

మోస్రా, ఆగస్టు4: మండల కేంద్రంలో గల పిట్ల గంగాధర్ కాలనీలో నివసిస్తున్న ప్రజలకు ఇళ్ల వద్ద కాకుండా ఎక్కడో గ్రామ పంచాయతీ సంబంధిత నీరు పట్టుకునేందుకు నీటి నల్లాను దూరంగా బిగించారని నీరు పట్టుకునేందుకు వెళ్లాంటే దారిలేదు. చెట్ల పొదలతో అడవిలా ఉందని ఇప్పటి వరకు తేలుకాటుకు గురై బాధలు అనుభవించిన వారు ఇప్పటికీ చాలామంది ఉన్నారు. ఈ ప్రాంతం అడవిని పోలిఉండగా పాములు తిరుగుతున్నాయి. కావున ఈ కాలనీలోని పిచ్చి మొక్కలు తొలగించాలి. ఈ కాలానికి ఒక్క దారి కూడా సరిగ్గా లేదని మొత్తం ముళ్ల చెట్లతో అడవిని తలపిస్తుందని బురదమయంగా ఉందని కాలనీలో చిన్న వర్షం పడిన బురదలో జీవనం కొనసాగిస్తునని ఈ కాలనీలో పిల్లలు, ముసలి వాళ్లు ఉన్నారని గ్రామ పంచాయతీ అధికారులు కనీసం మా వైపు చూడలేకపోతున్నారిన మాజీ స్పీకర్ ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఒక ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు అందరు అధికారులు వచ్చిన మా గోడు వినలేకపోయారు. గత ఎన్నో సంవత్సరాల నుండి రోడ్డు వేయమని అడిగితే ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఉన్నదని పాఠశాల వరకు మాత్రమే సిమెంట్ రోడ్డు వేసిన రోడ్డుకు ఇరు వైపులా మట్టి వేయకు ఉన్న రోడ్డు పగిలిపోయిందని అడవిలాంటి కాలనీలో జీవినం కొనసాగుతున్న మా బతుకులకు దారి చూపాలని సంబంధిత అధికారులు మాగోడును పట్టించుకోని ఈ సమస్యలు పరిష్కారం చేయాలని కో రా రు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

• మిషన్ భగీరథ ఏఈ సాత్విక

జూలై నెలలో జరిగిన సర్వేలో వారికి మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వలేదు అన్నారు. గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకుంటే ఇస్తాము.

కాలనీ మొత్తం బురదమయంగా ఉంది



మా కాలనీలో మొత్తం బురదగా ఉంటది. ముళ్ల చెట్లు పిచ్చి మొక్కలతో అడవిలాగా ఉన్నది. ఇప్పటికి చాలా మందికి తేళ్ల కరిచి బాధలు పడ్డాము. పాములు తిరుగుతున్నాయి. భయం గుప్పిట్లో బతుకుతున్నాం.

- లక్ష్మి. కాలనీ వాసి, మోస్రా

త్వరలో రోడ్డుపై మొరం వేయిస్తాం



ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది కాబట్టి కాలనీ సమస్యలను ఉన్నతాధికారులకు చేరవేస్తాను వారి ఆదే శాలు రాగానే పని మెదలు పెడతాం , అంతే కాదు ఆ కాలనీలో ఉన్న పిచ్చి మొక్కలు కచ్చితంగా తొలగిస్తాము. రోడ్డుకు మొరం మట్టి వేయిస్తాము.

-ప్రేమ్‌కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మోస్రా

రాజ్యాంగ విరుద్ధంగా వర్గీకరణ తీర్పు



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

బోధన్‌రూరల్,ఆగస్టు4: రాజ్యాంగ విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు తీర్పు ఇచ్చారని, దేశంలోని 35కోట్ల మంది ఎస్సీలను ఒక తాటిపైకి తీసుకువచ్చే అవకాశాలను పక్కన పెట్టి తీర్పు ఇచ్చారని మాల మహానాడు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తడి మోహన్ రావు మాట్లాడుతూ బీజేపీ, టీడీపీలు రాజకీయ స్వార్థంతో ప్రవర్తిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తీర్పుపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు.

• మద్దతు తెలిపితే గ్రామాలలో తిరుగనివ్వం

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై పలు రాష్ట్రాలు నిరసన వ్యక్తం చేస్తుంటే రేవంత్‌రెడ్డి అనుకూలంగా మాట్లాడడం సరికాదన్నారు. తీర్పుపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు న్యాయవాది ఈశ్వర్ మాట్లాడుతూ బీజేపీ రాజకీయ కుట్రలతో వర్గీకరణ తీర్పు వచ్చేలా చేశారని, వర్గీకరణకు మద్దతు ఇచ్చే ఎమ్మెల్యేలను గ్రామాలలో తిరుగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఆనంపల్లి ఎల్లమయ్య, నీరడి రవి, శ్రావణ్ కుమార్, కారం స్వామి, జిల్లా ప్రతినిధులు ఆనంపల్లి ఎల్లమయ్య, సూర్యకాంత్, పల్నాటి యాదగిరి, డిస్కో సాయిలు, కోటగిరి మండల అధ్యక్షులు మిర్జాపురం సాయన్న, లక్ష్మణ్, సంజీవ్, కొప్పర్గ సాయిలు, రాహుల్, విఠల్, బోధన్ డివిజన్ కమిటీతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డిలో ఉద్రిక్తత

• మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థుల ఆందోళన
• డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు





చిన్నమల్లారెడ్డిలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న దృశ్యం, పోలీసుల బందోబస్తు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 4: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసు కున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... వారసత్వంగా వస్తున్న భూమి విషయంలో నెలకొన్న తగదాతో శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన ఏదుల్ల రవీందర్ అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రవీందర్ చనిపో వడానికి అతని పెద్దనాన్న సత్యనారాయణరెడ్డి, పెద్దమ్మ అనసూయ కారణమని ఆరోపిస్తూ వారి ఇంటివద్ద పెద్ద ఎత్తున కుటుంబీకులు, బంధువులు ఆందోళన చేపట్టారు.దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. రవీందర్ చనిపోవడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే గ్రామంలో అంత్యక్రియలు అయ్యే వరకు ఎలాంటి అవాంచనీయ సంఘట నలు చోటుచేసు కోకుండా డీఎస్పీనాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.భూతగదాల విషయంలోనే రవీందర్ ఆత్మహత్య చేసుకున్నందున మృతుని భార్యకూతురికి తగిన న్యాయం చేసిన తర్వాతనే అంత్యక్రియలు చేయాలనికుటుంబ సభ్యులు,బంధువులు,గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. దీంతో ఒక్కసారిగా గ్రా మంలో ఉద్రిక్తత నెలకొంంది.పరిస్థితిని అదు పు చేయాడానికి పోలీసుల బందోబస్తు చేశారు.

అబ్బాపూర్‌లో ఘనంగా తీజ్ పండుగ



అబ్బాపూర్(బి)తండాలో తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,ఆగస్టు4: మండలంలోని అబ్బాపూర్(బి)తండాలో ఆదివారం సాయ ంత్రం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు.గిరిజన బాలికలు, యువతులు 9రోజుల పాటు నిష్టతో గోదుమ మొలకలను పెంచి వాటిని బుట్టలో ఉంచి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన యువతులు, మహిళలు తమ సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.ఆషాడ మాసం చివరి అమావాస్య కావడంతో స్థానిక జగదాంబ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈకార్యక్రమంలో శోభన్, కైలాస్ నాయక్, పీర్ సింగ్, రవి, రాజేష్, మోతిలాల్, సేవాల్‌జీ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి సన్మానం

వేల్పూర్, ఆగస్టు4: వేల్పూర్ మండల కేంద్రంలో పూర్వ సీనియర్ కబడ్డీ క్రీడాకారుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ కబడ్డీ క్రీడాకారులు అందరు ఒక్కచోట చేరి ఒకరినొకరు పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వకబడ్డీ జాతీయ క్రీడాకారుడు ఏలేటి కిషన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ పూర్వవిద్యార్థులు గంగాధర్, రాజ్‌కుమార్, రాజేందర్, సందీప్‌లతో కబడ్డీ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినులు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు4: ఆర్మూర్‌పణంలోని శ్రీబాషిత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక య్యారు.పాఠశాల కరస్పాండెంట్‌సుందర్ తెలిపారు. శనివారం నిజామాబాద్‌లోని నాగారం స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో శ్రీబాషిత విద్యార్థినిలు లాస్య ప్రియ,వంద మీటర్ల పరుగుపందెంలో, ఎస్.లావణ్య, జావెలిన్‌త్రో పోటీలలో అత్యుత్తమప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ముస్తాబైన ఏకచక్రేశ్వరాలయం



అలంకరించిన ఏకచక్రేశ్వర ఆలయ ప్రాంగణం

బోధన్‌రూరల్,ఆగస్టు4: బోధన్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన ఏకచక్రేశ్వరాలయం శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభం కావడం శుభ సూచికం అని ఆలయ వేద పండితులు గణేష్ మహరాజ్ అన్నారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దామన్నారు. నెల రోజుల పాటు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. మహ శివునికి శ్రావణ మాసం చాలా ప్రీతికరమైనదని ఈ మాసంలో భక్తులు నిష్ఠగా ఉంటూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కోరిక కోర్కెలు తప్పకుండా నెరవేరుతాయని ఆయన పేర్కొన్నారు. శ్రావణ మాసంలో దేవాలయంలో ప్రతి ఒక్కరు సంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. ఆలయంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. శ్రావణ మాసంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సరిత

పెద్దబజార్, ఆగస్టు 4: నగరంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పీవోడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పిట్ల సరిత అన్నారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మద్యానికి వ్యతిరేకంగా, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా స్త్రీ, పురుష సమానత్వం కోసం స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛ కోసం పోరాడాలని అన్నారు.

• పీవోడబ్ల్యు నగర నూతన కార్యవర్గం

నగర అధ్యక్షురాలు నీలం లక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఆకుల సబిత, ప్రధాన కార్యదర్శి గొంట్యాల సంజన, సహాయ కార్యదర్శి శాంతక్క, కోశాధికారి మానస, కార్యవర్గ సభ్యులు ఉమారాణి, రాజ్యలక్ష్మి, తంకడి రేఖ, సురేఖ, అనంతక్క, మాధవి, గంగ, పావని, లక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర సైక్లింగ్ సంఘ ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కాంత్



విజయ్‌కాంత్‌ను అభినందిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, ఆగస్టు 4:తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా భూలోకం విజయ్‌కాంత్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర సైక్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా భూలోకం విజయ్‌కాంత్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్‌కాంత్‌రావు మాట్లాడుతూ సైక్లింగ్ క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. సెప్టెంబర్ 24 నుంచి జరుగనున్న ఖేలో ఇండియా సౌత్‌జోన్ మహిళల సైక్లింగ్ పోటీలు జిల్లాలో జరుగుతున్నాయని అన్నారు. దక్షిణ భారతదేశంలోని మహిళలు, బాలికలు ఈ పోటీలో పాల్గొంటారని అన్నారు. ఈ పోటీలకు సంబంధించి కార్యవర్గ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైక్లింగ్ జిల్లా అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుబేదార్, నర్సింగ్‌రావు, రాకేష్‌కుమార్, నరేష్‌కుమార్, దుర్గామల్లేష్, శరత్‌కుమార్, శ్రీధర్‌రావు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ ఉద్యోగం సాధించిన నాగేపూర్ యువకుడు



నవదీష్ గౌడ్

నవీపేట,ఆగస్టు4: మండలంలోని నాగేపూర్‌కు చెందిన ఏ.నవదీష్ గౌడ్ పంచాయతీరాజ్ విభాగంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) ఉద్యోగం సాధించాడు. గీత కార్మిక కుటుంబానికి చెందిన నవదీష్ గౌడ్ చిన్నప్పటి నుండి విద్యాభ్యాసంలో ముందుండే వాడు. రెండు సంవత్సరాల క్రితం ఎంటెక్ పూర్తి చేసిన ఆయన హైదరాబాద్ టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగానికి ప్రిపరేషన్ అయ్యాడు. 2022లో జరిగిన ఉద్యోగ అర్హత పరీక్షకు హజరు కాగా శుక్రవారం విడుదలైన ఫలితాలలో నవదీష్ గౌడ్ ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. 193ర్యాంకు సాధించి ఓపెన్ కేటగిరిలో ఉద్యోగం పొందాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల తల్లిదండ్రులు జ్యోతి, లక్ష్మినారాయణ గౌడ్‌లతో పాటు గ్రామస్థులు అభినందించారు.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం



వేల్పూర్‌లో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వేల్పూర్, ఆగస్టు4: ఎస్సీవర్గీకరణపై అత్యున్నత సుప్రీం కోర్టు ఇచ్చి తీర్పు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం వేల్పూర్ మండల కేంద్రంలోని బాబుజగ్జీవన్ రావు, అంబేద్కర్ విగ్రహానికి మాదిగ దండోర సభ్యులు నివాళులు అర్పించారు. అనంతరం మండల కేంద్రంలో అంబేద్కర్‌చౌరస్తా వరకు మాదిగ దండోర సభ్యులు, మహిళలు పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం తుది తీర్పు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీరిజర్వేషన్‌లు అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోర సభ్యులు, మహిళలు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టీసీసీ థియరీ పరీక్ష

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 4:టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ థియరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. లోయర్ గ్రేడ్ టైలరింగ్, డ్రాయింగ్, మ్యూజిక్‌కు సంబంధించిన పరీక్షలు మానిక్‌భవన్, ఆదర్శ హిందీ పాఠశాలలో వివిధ సెషన్స్‌లలో నిర్వహించారు. సైకాలజీ, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ పరీక్ష, మెథడ్స్ ఆఫ్ టీచింగ్, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ స్పెషల్ పరీక్షలకు మొత్తం 435 మందికి గాను 433 మంది హాజరుకాగా ఇద్దరు గైర్హాజరయ్యారు.

బీసీసీ యూత్ ఫెడరేషన్ కార్యవర్గం



నూతనంగా ఏర్పాటైన కార్యవర్గసభ్యులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 4 : పట్టణంలోని బీసీసీ యూత్ ఫెడరేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా చిట్టిమల్లె ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులుగా మోతె సంతోష్ రెడ్డి, పరనంది ప్రసాద్, ప్రధానకార్యదర్శిగా దుబ్బాకప్రసాద్, కార్యవర్గసభ్యులుగా సుతారిరాజు, రమేష్, ప్రవీణ్, అనిల్, శ్రీధర్, వెంకట్ రెడ్డి, వంశీకృష్ణ, వెంకట్రాజం, శ్రీనివాస్ తదితరులతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

ఆరుగురిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

బీర్కూర్, ఆగస్టు 4 : మండల కేంద్రంలో ముగ్గురు యువకులు ఆరుగురిపై దాడి చేశారు. ఈ ఘటనలో గణేష్, బన్ను అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు గాయపడిన ఆరుగురు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ముగ్గురు యువకులపై ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... బీర్కూర్ మండల కేంద్రంలో పుల్లారావు హోటల్‌లో పనిచేసే బన్నీ అనే యువకుడు బైక్‌పై వెళుతున్నాడు. సతీష్ అనే యువకుడు వేగంగా ఎందుకు నడుపుతున్నావంటూ అసభ్యపదజాలంతో దూషించాడు. దీంతో బన్నీ తనను ఎందుకు దూషించావని ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య గొడవ పెరిగి కొట్టుకున్నారు. దీంతో పక్కనే ఉన్న సతీష్ స్నేహితులు అనిల్, నవీన్‌లు ముగ్గురు కలిసి బన్నీని చితక్కొట్టారు. అడ్డుకునేందుకు వచ్చిన మరో ఐదుగురిపై దాడి చేశారు. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడినవారు సతీష్, అనిల్‌లపై బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 4 : కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ రెడ్డి సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిందాల ఆనంద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోగుకిరణ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేందర్‌రెడ్డి, గడ్డం రవీందర్‌రెడ్డి, ప్రధాన సంయుక్త కార్యదర్శులుగా రాధాకిషన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా లింగారెడ్డి, ముఖ్య సలహాదారులుగా నిమ్మ విజయ్‌కుమార్‌రెడ్డి, నారెడ్డి మోహన్‌రెడ్డి, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, ఏ.ప్రభాకర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, ఇంద్రరెడ్డి, గిరెడ్డి గంగారెడ్డిని ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 04 : సుప్రీకోర్టు ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో హర్షం వ్యక్త చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రూసేగాం భూమయ్య మాట్లాడుతు సుప్రీకోర్టు ఎస్సీ వర్గీకరణ అంశంకు సంబంధించిన అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఈ అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేస్తామని తెలపడం ఆనందంగా ఉందని తెలిపారు. తాము తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తుకరాం, గంగారాం, చందూ, అయిల్‌వార్ మారుతి, రవీందర్, మహిపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల నివారణకు చర్యలు



పిచ్చిమొక్కలు మొలవకుండా స్ప్రే చేస్తున్న సిబ్బంది

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 4 : గ్రామ పంచాయతీ పరిధిలో ఆయా కాలనీలలో పిచ్చిమొక్కలు మొలవకుండా నివారణ చర్యలు చేపటినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం గ్రామపంచాయతీ పరిధిలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరగకుండా నివారణ మందును సిబ్బందితో స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురిసి పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగితే వ్యాధులు ప్రబలే అవ కాశం ఉన్నందున పిచ్చిమొక్కల నివారణ మందును స్ప్రే చేయిస్తు న్నామని తెలిపారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష బరిలో ఖాసీఫ్

లింగంపేట, అగస్ట్ 4 : లింగంపేట మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఖాసీఫ్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష బరిలో పోటీలో ఉన్నట్లు తెలిపాడు. ఈనెల 5నుంచి అక్టోబర్ 5వరకు ఆన్‌లైన్ ద్వారా జరిగే ఓటింగ్ ద్వారా యువజన అధ్యక్షున్ని ఎన్నుకుంటారని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ వేసినట్లు ఆయన తెలియజేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి పూర్తి మద్దత్తు ఉందని ఆయన తెలియజేశారు.

ఇన్‌చార్జీలే దిక్కు..!

- వివిధ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేక అంతా ఇన్‌చార్జీల మయం
- పర్యవేక్షణ కరువు
- కుంటుపడుతున్న అభివృద్ధి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయ భవనం



మండల విద్యాధికారి లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

నాగిరెడ్డిపేట, ఆగస్టు 4 : మండలంలోని వివిధ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జీ అధికారులే దిక్కయ్యారు. అసలే జిల్లాకు సరిహద్దు మండలం, ఆపై రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో వివిధ శాఖల్లో పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. మండలంలో అభివృద్ధి కుంటుపడుతుందన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోతో మొదలుకుని ఎంఈవో, ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ రాజ్ ఏఈ, ఉపాధిహామీ ఏపీవో, ఎస్సై, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి పోస్టుల్లో రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జి అధికారులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండల ప్రజలు తమ పనుల గురించి ఏ కార్యాలయానికి వెళ్లినా అక్కడ రెగ్యులర్ అధికారి లేక ఇన్‌చార్జి అధికారులే దర్శనమిస్తుండటంతో మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● **వివిధ శాఖల్లో ఇన్‌చార్జి అధికారులిలా....**

మండల పరిషత్ శాఖకు, మండల అభివృద్ధికి ఎంపీడీవో ముఖ్యమైన పాత్ర పోషించాల్సి ఉండగా నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా ఇది వరకు విధులు నిర్వహించిన పర్బన్న ఇటీవలే పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఉన్నతాధికారులు రెగ్యులర్ ఎంపీడీవోను నియమించలేదు. మండల ఎంపీవోగా పనిచేస్తున్న ప్రభాకర్ చారికి ఇన్‌చార్జీ ఎంపీడీవో బాధ్యతలను అప్పగించారు. మండలంలో సంవత్సరాల తరబడి రెగ్యులర్ ఎంఈవో లేక మండలంలో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశంకు నాగిరెడ్డిపేట ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. ఆయన సంవత్సరాల తరబడి ఇన్‌చార్జీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. నాగిరెడ్డిపేట మండలంలో పోచారం ప్రాజెక్టు ఉన్నా ప్రాజెక్టు నీటి విడుదల, ప్రాజెక్టు బాగోగులు చూసేందుకు మండలంలో నీటి పారుదల శాఖ రెగ్యులర్ ఏఈ లేరు. మండల కేంద్రంలో నీటిపారుదల శాఖ కార్యాలయం ఉన్నా ఇక్కడ ఏఈ లేరు. ఇక్కడ పనిచేసిన ఏఈ సుమారు ఏడాదిక్రితం బదిలీపై వెళ్లగా ఆ స్థానంలో తిరిగి రెగ్యులర్ ఏఈని ఇంత వరకు ఉన్నతాధికారులు నియమించలేదు. ఎల్లారెడ్డి ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్‌కు నాగిరెడ్డిపేట ఏఈగా ఇన్‌చార్జి బాధ్య తలు అప్పగించారు. ఆయన మండలానికి ఎప్పుడు వస్తారో ఎవరికి తెలియని పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం ఖరీఫ్‌సీజన్ ఉన్నందున ఖరీఫ్ పంట సాగు కు పోచారం ప్రాజెక్టు ద్వారా త్వరలో నీటి విడుదల చేయనున్నందున మండలంలో రైతులకు ఎల్లవేళలా ఏఈ అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలో పంచాయతీ రాజ్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న పిచ్చయ్యకు కొన్నినెలల క్రితం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రం గా గాయపడ్డారు. దీంతో ఆయన విధులకు రావడం లేదు. మండలంలో జరిగే అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల పర్యవేక్షణ, బిల్లులు చెల్లింపుల కోసం లింగంపేట ఇరిగేషన్ ఏఈ అరుణ ప్రభకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. మండల ఉపాధిహామీ కార్యాలయంలో రెగ్యులర్ ఏపీవో లేరు. మండల ఉపాధిహామీలో విధులు నిర్వహిస్తున్న ఈసీ (ఇంజనీరింగ్ కన్సల్టెంట్) సాయిలుకు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ఏపీవోగా బాధ్యతలు అప్పగించారు. మండలానికి కొత్తగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను ప్రభుత్వం నియమించలేదు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమ చందర్‌కు నాగిరెడ్డిపేట కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల ప్రత్యేక అధికారిణిగా పనిచేసిన వీణకు ఇటీవలే ఎల్లారెడ్డికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో ప్రత్యేక అధికారిగా ఎవరిని నియమించలేదు. ఇదే పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న స్వర్ణకుమారికి ఉన్నతాధికారులు ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగించారు. అలాగే జిల్లాలో ఇటీవల జరిగిన ఎస్సైల బదిలీలలో భాగంగా నాగిరెడ్డి పేట ఎస్సై రాజు మెదక్ జిల్లాకు బదిలీ అయి వెళ్లారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు. ప్రస్తుతం నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న లచ్చిరాం నాయక్‌కు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇలా వివిధ శాఖల్లో రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జి అధికారులే విధులు నిర్వహిస్తున్నారు.

● **అదనపు బాధ్యతలతో అవస్థలు**

నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ శాఖల్లోని అధికారులకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను అప్పగించడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్‌గా తమ విధులు నిర్వహిస్తూనే అదనంగా ఉన్నతాధికారులు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించడంతో వారు రెండు అధికార పదవుల్లో కొనసాగుతుండడంతో తమ పదవులకు సరైన న్యాయం చేయలేకపోతున్నారు. కొందరు ఎల్లారెడ్డి అధికారులకు నాగిరెడ్డిపేటలో ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించడంతో వారు నాగిరెడ్డిపేటకు రాలేక సరిగా విధులు నిర్వహించడం లేదు. అత్యవసరం ఉంటే తప్ప వారు నాగిరెడ్డిపేట వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని నాగిరెడ్డిపేటలో ఇన్‌చార్జీ పాలనకు స్వస్తిపలికి అన్ని శాఖల్లో వెంటనే రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నాగిరెడ్డిపేట నీటి పారుదల శాఖ కార్యాలయం

పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు



దోమకొండలో ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు



భిక్కనూరులో ..

దోమకొండ, ఆగస్టు 4 : మండల కేంద్రంలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా 10వ తరగతి 1992-93 ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు కలసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, నాగరాజ్‌రెడ్డి, గణేష్, నాగరాజు, రాంచంద్రం, శంకర్, భాస్కర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్రంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా అసోసియేషన్‌లో మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొని భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్ర మాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు పిప్పిరి వెంకటి పాల్గొన్నారు.

బాన్సువాడ : స్నేహితుల దినోత్సవం నాడు పూర్వవిద్యార్థులు అందరూ ఒకచోట కలవడం ఆనందంగా ఉందని వివేకానంద పాఠశాల పూర్వవిద్యార్థులు తెలిపారు. పట్టణంలోని వివేకానంద పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు 1993-2000 సంవత్సరం విద్యార్థులు స్నేహితుల దినోత్సవం రోజు కలుసుకుని అలనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చాలా రోజుల తర్వాత ఒక చోట చేరడం అప్పటి విషయాలు గుర్తుచేసుకుని పాతస్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రుద్రంగి గంగా ధర్, రమేష్, శ్రీనాథ్, శేఖర్, రాహుల్‌సూర్య పాల్గొన్నారు.

భిక్కనూరు : భిక్కనూరు ఉన్నత పాఠశాలలో చదివిన 1993-94 పదవతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు కలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. సూమారు 100మందితో ఈ పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించి గత స్మృతులను స్మరించుకుంటూ గురువులకు సన్మానం, సహపంక్తి భోజనాలు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపార నిమిత్తం స్థిరపడిన వారంతా ఒక్కచోట అదికూడా స్నేహితుల దినోత్సవం నాడు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

స్నేహితుల దినోత్సవ వేడుకలు...

స్నేహితుల దినోత్సవం పూర్వవిద్యార్థుల సమ్మేళనం రోజున కలిసి రావడంతో వారంతా స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుని స్వీట్లు పంచుకున్నారు. గత పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ విద్యార్థినీ విద్యార్థులు సంతోషంగా గడిపారు. కాగా బ్యాచ్‌కు చెందిన కొందరు స్నేహితులు మరణించగా వారికి ఈ సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించి వారి కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

గురువులకు సన్మానం...

1993-94 సంవత్సరంలో బోధించిన గురువులను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానంచి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు నాగభూషణంగౌడ్, రాందాస్, నర్సయ్య, కాశీనాథ్‌శర్మ, గంగాకిషన్, గౌరిశెట్టి రమేష్, యాదగిరి, ప్రతాప్‌రెడ్డిని శాలువలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. వారి యోగక్షేమాలను తెలుసుకుని వారితో విద్యార్థులు సంతోషంగా గడిపారు. బ్యాచ్‌లో చాలామంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తుండగా పలువురు వ్యాపారంలో స్థిరపడ్డారు.



బాన్సువాడలో...



గురువును సన్మానిస్తున్న విద్యార్థులు

విద్యుత్ పరికరాల నాణ్యత పరిశీలన



విద్యుత్ పరికరాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారి కళ్యాణ్ చక్రవర్తి

బీర్కూర్, ఆగస్టు 4 : మండలకేంద్రంలో నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అయితే రోడ్డువిస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు మార్చాల్సి ఉంది. ఈ మేరకు విద్యుత్ స్తంభాలు, పరికరాలు బీర్కూర్‌కు వచ్చాయి. ఆదివారం ఎన్‌డీపీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ కళ్యాణ్, చక్రవర్తి బీర్కూర్‌కు వచ్చారు. కొత్త విద్యుత్ స్తంభాలు, పరికరాల నాణ్యతను పరిశీలించారు. రెండు రోజుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను లాగుతామని ఏఈ రాంప్రసాద్ తెలిపారు. ఆయన వెంట ఏఈ ఉన్నారు.

రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రెడ్డి సంఘం సభ్యులు

దోమకొండ, ఆగస్టు 4 : రాజా బహదూర్ వెంకట రామారెడ్డి విద్యాపరిషత్ ట్రస్ట్ కామారెడ్డి ఆధ్వర్యంలో సెప్టెంబరు 3న జిల్లా కేంద్రంలో నిర్వహించే రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దోమకొండ రెడ్డి సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పార్టీలకతీతంగా జన సమీకరణ చేయాలని, కులస్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్‌రెడ్డి, సిద్దారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, నర్సారెడ్డి, మాల్లారెడ్డి, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం

రామారెడ్డి, ఆగస్టు 4 : మండలంలోని రెడ్డిపేట గ్రామ చెరువులో 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రామారెడ్డి పోలీసులు తెలిపారు. మృతుని ఒంటి మీద బ్లాకలర్ బనియన్, బ్లాక లర్‌షర్ట్ ఉంది. ఈ శవం కామారెడ్డి మార్చురి గదిలో ఉందని ఎవరైనా గుర్తుపట్టినచో 8712686152 నంబర్‌కు సమాచారం అందించాలని రామారెడ్డి ఎస్ఐ తెలిపారు.

'పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండాలి'



యూత్ కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 4 : కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే వారు సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తే గొప్ప నాయకులు అవుతారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ పేర్కొన్నారు. ఆదివారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో తనను కలిసేందుకు వచ్చిన యూత్ కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో యూత్ కాంగ్రెస్ ఎన్నికలు జరగనున్నందున యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కలిసేందుకు రాగా వారికి ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తన మద్ద తు కావాలంటే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడు చుకోవడంతో పాటు. ఎన్నిక అయిన తర్వాత కాలయాపన కోసం కాకుండా పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. అంతే కాకుండా చెడువ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని తాను అసలు ప్రోత్సహించనని తెలిపారు. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలతో కో ఆర్డినేట్ చేసుకుంటూ విద్యార్థి విభాగాలను బలంగా చేసుకోవాలని, తద్వారా కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో బలపడుతుందని సూచించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- శివంభజే
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- రాయన్, బడ్డి

బాన్సువాడ

మహేశ్వరి	- రాయన్
వెంకటేశ్వర	- పురుషోత్తముడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

